


## నెలనెలా నవ్వుల పండగ



### కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకటకృష్ణమూర్తి

**ఓ బాంక్ ,** తమ ఆఫీసులో లీగల్ ఎడ్వైజర్ పోస్టుకోసం కొందరు లాయర్లని ఇంటర్వ్యూ చేస్తోంది.

"మాకు నిజాయితీగల లాయర్లు ముఖ్యం. ఎందుకంటే నగదు చేతులుమారే వ్యాపారం మాది. "

ఓ అభ్యర్థితో చెప్పాడు ఇంటర్వ్యూ బోర్డు మెంబర్.

"నేను నిజాయితీ గలవాడినండీ.. నా చదువుకి మా నాన్నగారు పదిహేనువేల రూపాయలు అప్పు ఇచ్చారు. చదువు పూర్తయ్యాక నా మొదటి కేసుతో ఆ మొత్తం ఆయనకి నయాపైసా తగ్గకుండా తిరిగి ఇచ్చేశాను." చెప్పాడా అభ్యర్థి.

"అలాగా..!? మీ మొదటి కేసు ఏమిటి?" అడిగాడు.

"ఆ పదిహేను వేలకి మా నాన్నగారు నామీద వేసిన వ్యాజ్యం.." చెప్పాడా అభ్యర్థి.!

❀❀

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"నన్ను పెళ్ళిచేసుకోకముందు మీరెంతో ధైర్యవంతులనుకునేదాన్ని" భర్తను కోప్పడుతూ అందో భార్య.

"నీలాటిదాన్ని పెళ్ళిచేసుకున్నందుకు ఎంతో గుండె ధైర్యం ఉన్నవాడినని జనమంతా ఇప్పుడనుకుంటున్నారు" భార్య మాటల్ని సరిచేస్తూ అన్నాడా భర్త.

ఓ దుకాణం ముందు బోర్డు రాసుంది యిలా –

"అసలు సిసలైన చిక్కని పాలు లీటరు ఆరు రూపాయలు"

"చిక్కని పాలు – లీటరు నాలుగు రూపాయలు"

"పాలు లీటరు మూడు రూపాయలు."

నువ్వంటే నాకెంతో అభిమానం. అందుకే నువ్వెక్కడ చెడిపోతావోనని అప్పుడప్పుడు కొడుతుంటానంతే" అన్నాడు టీచర్ సురేష్‌తో.

"నాక్కూడా మీరంటే చాలా అభిమానం సార్. కానీ మీకంటే చిన్నవాణ్ణి కావడం మూలంగా దాన్ని ప్రదర్శించలేకపోతున్నా. అంతే" అన్నాడు సురేష్.

"ఏమయ్యా! నువ్వు మా క్లయింట్‌ను గాడిదా అని తిట్టావా?" అడిగాడు లాయర్.

"అవునండి" చెప్పాడు ముద్దాయి తొణక్కుండా.

"దున్నపోతు అని కూడా అన్నావా? "

"అయ్యో ఆ మాట అనటం మరచిపోయానే."

"నువ్వు సరిగా పనిచేయడం లేదు. మరో నౌకర్ని పెట్టుకుంటాను" కోపంగా అన్నాడు యజమాని.

"వెంటనే పెట్టండి సార్. ఇద్దరి పని నేనొక్కణ్ణే చేసుకోలేక చస్తున్నాను" ప్రశాంతంగా అన్నాడు ఆ నౌకరు.

"ఒరేయ్ నువ్వు చేసిన టీ బాగానే వుంది కానీ మరో నాలుగు టీలు తయారు చేసి వుండాల్సింది" అన్నాడు యజమాని వంటవాడితో.

"ఎందుకు సార్? టీ అంత బావుందా?"

"నా టీలో వేసిన పంచదార మరో నాలుగు కప్పులకు సరిపోతుంది గదరా"

ఉన్నట్టుండి ప్రయాణిస్తున్న రైలు ఆగిపోయేటప్పటికి కంగారుపడ్డ సుబ్బారావు "ఏమండీ మాస్టారూ! రైలెందుకు ఆగిపోయిందంటారు?" అని అడిగాడు తోటి ప్రయాణికుణ్ణి.

"రైలు కింద ఓ ఆవు పడింది"

"రామరామ... పట్టాలమీదే చనిపోయిందా ఆవు?"

"అబ్బే లేదు. రైలింజను దాన్ని వెంటాడి పొలాల్లో అందుకుని హతమార్చింది."

"ఆఫ్ట్రాల్ రూపాయిన్నర ఖరీదు చేసే పెన్ పోగొట్టినందుకు నన్ను సస్పెండు చేశారు పై అధికారులు" మిత్రుడి దగ్గర వాపోతూ అన్నాడో ప్రభుత్వ డాక్టర్.

"మరి అంత అన్యాయంగా ఎలా చేశారంటావ్?"

"అదే నాకూ తెలియడంలేదు. పైగా ఆ పోగొట్టిన పెన్నును గతవారం నేను ఆపరేషన్ చేసిన రోగి కడుపునుండి ఎంతో కష్టపడి బయటకు తీశారు కూడా"

"చదువుకున్న, అందమైన ఆస్తిపరురాలైన, ఉద్యోగం చేస్తున్న అమ్మాయిని చూసి మరీ పెళ్ళి చేసుకుంటాను"

"ఒకేసారి నలుగుర్ని చేసుకుందామంటే 'లా' ఒప్పుకోదనుకుంటూనే"

🦋🦋🦋

ఎదురింటి తాయారుని గాఢంగా ప్రేమిస్తున్నాడు సుబ్బారావు. అయితే తాయారు తనను ప్రేమిస్తోందో లేదో ఎలా తెలుసుకోవడం? చివరికోరోజు ధైర్యంచేసి తాయారు ఇంటికెళ్ళి తలుపు తట్టాడు సుబ్బారావు.

తలుపు తెరిచిన తాయారు చిన్న తమ్ముడు "అరే.. మీరా సుబ్బారావుగారూ మీరీవేళ మా ఇంటికి వస్తారని మా అక్కయ్య చెప్పిందిలే" అన్నాడు సుబ్బారావును లోనికి ఆహ్వానిస్తూ.

"అలాగా!" ఆనందాశ్చర్యాలతో కుర్చీలో కూర్చున్నాడు సుబ్బారావు.

సుబ్బారావు తెచ్చిన స్వీట్స్, పూలు, పళ్ళు అందుకుని లోనికి వెళ్ళబోతూ చెప్పాడు తాయారు తమ్ముడు.

"అవును. అందుకే అక్కయ్య ఉదయాన్నే తన స్నేహితురాలు పద్మ ఇంటికి వెళ్ళింది. బహుశా రేపు రావచ్చు."

🦋🦋🦋

COMMENTS